



అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

శనివారం 1 ఆగస్టు 2026 | వరంగల్ | సంపుటి: 20 | సంచిక: 272 | పేజీలు 05




# ఓ(గో)ల్డ్ ఫ్రెండ్!





చిన్ననాటి సర్కారు బడిలో చదివిన ఒక తరం జ్ఞాపకాలు ప్రకృతికి హాని చెయ్యని, చెదలు పట్టని సంచిలో మూటకట్టి ఉన్నాయి. వాటిలో ఉండే గవర్నమెంటు పుస్తకాలను తడిమి చూసినప్పుడు ఇన్ని పాఠాలా అని బరువుగా నిట్టూర్చిన రోజు, నిమ్మ పిప్పరమెంటు దాచుకున్న సంచి జ్ఞాపకాలు ఇంకా ఉన్నాయి. జుబ్బల సంచి మెడకేసుకొని, మొదటి బడి గంట కొట్టక ముందే తొందరపడి బయలుదేరిన మిత్రతరం మనదే కదా!! స్నేహితులతో కలిసి ఇంటి నుండి బడికి వెళ్తూ చెప్పుకున్న ముచ్చట్లు, ప్రతీ ఊళ్ళో సందు సందులో ఉన్న ఇంటిని గమనిస్తూ, ఆగిన బస్సులో ప్రయాణికులను తీసుకొని పోయినట్లు, దోస్తుగాన్ని తోడుకొని బడికి పోవడం కాన్వెంటు, కాంక్రీటు విద్యార్థులకు తెలవని గొప్ప అనుభవం! బడి గంట కొట్టగానే దోస్తులతో కలిసి తిన్న పుల్ల ఐస్క్రీమ్, పల్లీ పట్టి, బూరు మిఠాయి, బొంబాయి మిఠాయి గడియారం, నిమ్మ పిప్పారమెంటు, బఠాణీ, “ఆశ” పెట్టే ఐదు పైసల చాక్లెట్లు కల్తీ లేని క్లాస్ మేట్లు.. అవే మాకు పిజ్జాలు, బర్గర్లు, బ్రేక్ ఫాస్ట్ లు!. బజార్లో బాతాఖానీ, గోళీలాట, తొక్కుడుబిళ్ళ మర్చిపోలేదు. చింత గింజల ఆటల్లో, అష్టా చెమ్మా ఆటల్లో తొండి చేసిన దోస్తు బెండు తీసినా, కొట్లాటకు పోయి దెబ్బలుతిన్నా, తెల్లారి కలిసిపోయేలా అపర చాణక్యం ప్రదర్శించే నేస్తం ఒకడు ఉండేటోడు. దోస్తులను విడదీయడానికి వాట్సప్ లు, ఫేస్ కు మాస్కులు వేసుకునే ఫేస్ బుక్ ఫ్రెండ్స్ అప్పుడు లేకుండె..!!

బడికి సెలవు వస్తే, చెడ్డి దోస్తుతో చేసిన హంగామా ఊరంతా తిరిగే అంబారీ ఎక్కినంత సంబరం. పచ్చని పసిరిక చేలల్లో చేరి ఆడిన పతంగులు, చిర్రగోనె, టైరు బండి ఆటలు తిరిగి రాని బ్లాక్ అండ్ వైట్ అనుభవాలు. గ్రామీణ సంపదలో, మట్టి మనుషుల్లో పెరిగిన బాల్యం, నిప్పుల కొలిమిలో కాల్చుకు తిన్న తాటిపండు అంతటి తియ్యటి జ్ఞాపకాలు అవి..!

ఇప్పటి వరకూ మీతో ఉన్న ప్రతీ ఒక్క ఓ(గో)ల్డ్ ఫ్రెండ్ కి ఈ పదాలు అంకితం.

#(G)oldfriend
#Happyfriendship day







డా. పల్లె రవి వంశీ మోహన్
ఎడిటర్ అండ్ ఎండీ - అక్షరశక్తి


## గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు
# శాశ్వత రక్షణ కల్పిస్తున్నాం

- వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క

2





# హనుమకొండలో దారుణం

- కాళ్లు, చేతులు కట్టి మెడ కోసి..
- భార్యను హత్య చేసిన భర్త
- అనాథలుగా ఇద్దరు చిన్నారులు

5

# గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తున్నాం

**వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం**

**లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం**

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు**

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**అక్షరశక్తి, ములుగు :** గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తున్నామని, వరదలపై జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తతో ముందస్తు చర్యలతో నష్టాలను నివారణ చేయడం జరిగిందని, లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం ఏటూరు నాగారం మండలం కేంద్రం లోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నది వరద ప్రవాహాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గత రెండు రోజులుగా తెలంగాణ తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉప్పొంగుతున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటిడిఏ పిఓ, సాగునీటి శాఖ అధికారులు, ఇతర శాఖ అధికారుల తో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లుగా ములుగు జిల్లాలో ప్రత్యేక వరద నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, వాగులు, గోదావరి పరివాహక ప్రాంతాలు, ముంపు గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నామని వివరించారు.

గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్నప్పటికీ ముందస్తు చర్యల కారణంగా ఎలాంటి నష్టం జరగలేదన్నారు. రెండు నెలల క్రితమే గోదావరి పరివాహక ప్రాంతాల్లో జిల్లా ఉన్నత అధికారులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించి అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. గతంలో రామన్నగూడెంలోకి వరద నీరు చేరేదని, ఈసారి ముందస్తు చర్యలతో ఆ ప్రమాదాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు. రామన్నగూడెం, మంగపేట ప్రాంతాల్లో కరకట్ట నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, సుమారు 800 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలు వరదలు, వాగులు ఉప్పొంగిన సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాల సమయంలో అడవుల్లోకి పశువులను మేపేందుకు వెళ్లడం, చేపల వేటకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. 2022, 2023 సంవత్సరాల్లో గోదావరి, జంపన్నవాగు వరదల వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కరకట్ట పనులను కూడా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి రెండో విడతలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎం పి డి ఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

## విద్యార్థినుల అదృశ్యం..

**గాలింపు చేపట్టిన పోలీసులు**

**అక్షరశక్తి, హనుమకొండ:** శాయంపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ముగ్గురు విద్యార్థినులు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, శుక్రవారం అర్ధరాత్రి సమయంలో హాస్టల్ ప్రహరీ గోడ దూకి 6వ, 7వ, 8వ తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థినులు బయటకు వెళ్లినట్లు సమాచారం. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థినుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పాఠశాల పరిసరాలతో పాటు సమీప ప్రాంతాల్లోనూ విచారణ కొనసాగిస్తున్నారు. క్యాంపస్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ విద్యార్థినులు ఎలా బయటకు వెళ్లగలిగారనే అంశంపై పోలీసులు, అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ భద్రత, రాత్రి పూట సిబ్బంది పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థినుల ఆచూకీ తెలియకపోవడంతో వారి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

---



## కేయూలో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

**అక్షరశక్తి, హనుమకొండ:** కాకతీయ యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో తెలంగాణలో భర్తీ కానున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్షలకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అభ్యర్థులందరూ అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను స్టడీ సెంటర్‌లో సమర్పించాలని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ సూచించారు. నిపుణులైన అధ్యాపకులచే శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

---

# వరుస బైక్ చోరీలకు తెర

**నిందితుడు అరెస్ట్,**

**నాలుగు బైక్‌లు స్వాధీనం**



**అక్షరశక్తి,కాజీపేట:** కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీ కేసులను కాజీపేట పోలీసులు ఛేదించారు. చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా కాజీపేట పరిధిలో జరుగుతున్న బైక్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని విశ్లేషించి నిందితుడిని గుర్తించారు. కాజీపేట సీఐ శ్యామ్‌సుందర్ ఆదేశాల మేరకు ఎస్ఐ శివకుమార్, ఎస్ఐ మౌనికా రెడ్డి, క్రైమ్ టీమ్ సభ్యులు వీ. క్రాంతికుమార్, జీ. కుమారస్వామి తమ బృందంతో కలిసి పలు ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిరంతర నిఘా, సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడి వద్ద నుంచి నాలుగు చోరీకి గురైన ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించారు. నేరాల నియంత్రణలో భాగంగా ప్రజల భద్రతే లక్ష్యంగా కాజీపేట పోలీసులు అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేయడంతో పాటు తప్పనిసరిగా తాళాలు వేయాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ సూచించారు. చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసి బాధితులకు అందించే దిశగా వేగంగా చర్యలు తీసుకున్న పోలీసు బృందాన్ని స్థానికులు అభినందించారు.

---

## చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు అవగాహన సదస్సు

**అక్షరశక్తి,హనుమకొండ:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా విద్యాశాఖ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు (సీపీఓలు) ఒకరోజు అవగాహన, సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ శ్రీమతి ఎం.ఆర్. సునీత ప్రారంభించి, విద్యార్థుల్లో న్యాయ అవగాహన, రాజ్యాంగ విలువలు, బాలల హక్కుల పరిరక్షణ, సైబర్ భద్రత, మాదకద్రవ్యాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలనపై పాఠశాల స్థాయిలో అవగాహన కల్పించడంలో సీపీఓలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్ డాక్టర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ, బాలల రక్షణ, సురక్షిత పాఠశాల వాతావరణం కల్పించడం, ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించి అధికారులకు సమాచారం అందించడం వంటి బాధ్యతలను సీపీఓలు సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రామలింగం, న్యాయమూర్తులు, న్యాయవాదులు, సైబర్ క్రైమ్ పోలీసులు, వైద్య నిపుణులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

1-08-2026_Layout 1 02-08-2026 07:07 Page 3








# ఓరుగల్లు గడ్డపై మేయర్ పీఠమే లక్ష్యం

**బీజేపీ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత సమావేశం**

**నాయకులకు జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ దిశా నిర్దేశం**

**అక్షరశక్తి, వరంగల్;** ఓరుగల్లు గడ్డపై రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు నడుం బిగించాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల కార్య నిర్వహణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు గా హాజరైన జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ , రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, డా॥శ్రీ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, గురుమూర్తి శివకుమార్ గార్లు పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపునకు బూత్ కమిటీలే కీలకమని, ప్రతి బూత్‌లో కమిటీలను పటిష్టం చేసి ఓటర్లతో నిరంతరం టచ్‌లో ఉండాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, తప్పులను సవరించేలా బీజేపీ శ్రేణులు బూత్ స్థాయిలో ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియను వంద శాతం అయ్యే విధంగా బాధ్యతగా చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, స్థానిక మున్సిపాలిటీల్లో జరుగుతున్న అవినీతి, వైఫల్యాలను ఎండగట్టేలా బూత్ స్థాయిలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వరంగల్ మున్సిపల్ అభివృద్ధి హామీలను, నిధుల కేటాయింపులను గాలికొదిలేసిందని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను బూత్ స్థాయి నుంచి ఎండగడుతూ, ప్రజల పక్షాన బీజేపీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని గుర్తు చేశారు. ఓరుగల్లు కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరవేయడమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, సర్పంచ్ కన్నయ్య, జిల్లా పదాదికారులు, మండల అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జీలు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జీలు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు మరియు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్
# 314 మంది చిన్నారులకు విముక్తి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**

**అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్:** ఆపరేషన్ ముస్కాన్ -XII ద్వారా 314 మంది చిన్నారులను పని నుండి విముక్తి కలిగించినట్లు వరంగల్ పోలీస్ కమీషనర్ ఎన్.శ్వేత,ఐపిఎస్ తెలిపారు. ఇందుకు సంబందించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ గత నెల జులై 1వ తారీకు నుండి నిన్నటి రోజు వరకు చేపట్టిన 'ఆపరేషన్ మ-ుస్కాన్-XII' కార్యక్రమం ద్వారా మొత్తం 314 మంది చిన్నారులను రక్షించబడ్డారని. ఇందులో 269 మంది బాలురు, 45 మంది బాలికలు ఉన్నారని. ఈ ఆపరేషన్ ముస్కాన్ -శ×× ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిబంధనల ప్రకారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ఇటుక బట్టిలలో, ప్రమాదకర ప్రాంతాల్లో వరంగల్ పోలీస్ కమిషనరెట్ పరిధి లోని (9) సబ్ డివిజన్ పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసి, ఆ టీమ్స్ కు ఇంచార్జిగా (9) ూ×ం మరియు (36) మంది సిబ్బందిని నియమించి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్ సిబ్బందితో పాటు వరంగల్ హనుమకొండ జనగాం జిల్లాలకు చెందిన బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, షేర్, స్కోప్, ఖీవీవీ ూూూ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సహకారంతో బాల కార్మికులుగా మగ్గుతున్న 226 మందిని, బడి మానేసిన (డ్రాపౌట్స్) 85 మందిని, సురక్షితంగా ఆపరేషన్ ముస్కాన్ -XII టీం రక్షించి, వీరిని వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ముందు హాజరు పరిచి, పిల్లలకు మరియు వారు తల్లి తండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించామని వీరిలో తెలంగాణేతర రాష్ట్రాలైన బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్ మరియు అస్సాం రాష్ట్రాలకు చెందిన 130 మంది చిన్నారులు కూడా ఉన్నారని కమీషనర్ వివరించారు. నిబంధనలను ఉల్లంఘించి చిన్నారులతో పని చేయిస్తున్న యజమానులపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 55 ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసినట్లు మరియు 92 ఐఆర్ లు కార్మిక శాఖ అధికారులు చేత నమోదు చేపించామని, అలాగే వివిధ పోలీస్ స్టేషన్స్ లోని జనరల్ డైరీస్ లో 118 మంది పిల్లల వివరాలను నమోదు చేపించామని కమీషనర్ తెలిపినారు.

ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ.. "పిల్లలు బడిలో ఉండాలి కానీ పనిలో కాదు. బాల్యానికి అండగా నిలవడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవు," అని హెచ్చరించారు. చిన్నారుల హక్కులను కాపాడటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమీషనర్ గారు కోరారు. "పోలీస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ (WCD), చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC), లేబర్, మరియు ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లతో పాటు షేర్, స్కోప్, ఖీవీవీ ూూూ స్వచ్ఛంద సంస్థలు (NGOs), చైల్డ్ లైన్ అధికారులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.






## పట్టుపరిశ్రమతో రైతులకు స్థిరమైన ఆదాయం: కలెక్టర్ డా. సత్య శారద

అక్షరశక్తి,వరంగల్: రైతులు పట్టుపరిశ్రమను లాభదాయకమైన అనుబంధ వ్యవసాయంగా చేపట్టి స్థిరమైన ఆదాయం పొందాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సూచించారు. కలెక్టరేట్‌లో సెంట్రల్ సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన "మేరా రేషమ్ మేరా అభియాన్--2.0" జిల్లా స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకాన్ని ప్రోత్సహించాలని, డ్రిప్ ఇరిగేషన్, పంటల వైవిధ్యీకరణ, విలువ జోడింపు, మార్కెటింగ్ అవకాశాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి అనుకూల వాతావరణం, మార్కెటింగ్ సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గుండేటి రాజ్ కుమార్



**అక్షరశక్తి, వరంగల్ :** వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా సంగెం గ్రామానికి చెందిన గుండేటి రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, సంగెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ ఈరోజు నియామక పత్రాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా గుండేటి రాజ్ కుమార్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు అందరి సహకారం అభినందనీయం

### జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి

**అక్షరశక్తి, హనుమకొండ:** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--Special Intensive Revision) ప్రక్రియ అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో విజయవంతంగా కొనసాగుతోందని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అధికారులతో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిని ఇన్‌చార్జి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, వరంగల్ పశ్చిమ ఈఆర్‌వో, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్






ఎన్. రవి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియకు తొలుత నిర్ణయించిన ఆగస్టు 3 గడువును భారత ఎన్నికల సంఘం ఆగస్టు 10 వరకు పొడిగించిందని తెలిపారు.
రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే ఎస్ఐఆర్ ప్రక్రియ అమలులో హనుమకొండ జిల్లా మంచి గుర్తింపు పొందిందన్నారు.
జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి నిరంతర సమీక్షలు, సమన్వయ చర్యలతో ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
బీఎల్‌వోల ద్వారా సేకరించిన ఎస్ఐఆర్ దరఖాస్తుల డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను రీ-వెరిఫికేషన్ చేస్తున్నట్లు చెప్పారు.
ఇప్పటికీ ఎస్ఐఆర్ ఫారాలను సమర్పించని ఓటర్లు గడువులోగా సంబంధిత బీఎల్‌వోలకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు.
ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం లేదా జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించాలని కోరారు.
ఈ సమావేశంలో హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, కాంగ్రెస్ పార్టీ తరఫున ఎం.డి. నేహాల్, బీజేపీ తరఫున రావు అమరేందర్ రెడ్డి, ఎలుక నిశాంత్, బీఆర్ఎస్ తరఫున బి. ప్రవీణ్ కుమార్, టీడీపీ తరఫున కుసుమ శ్యామ్ సుందర్, వైఎస్సార్సీపీ తరఫున నాగబెల్లి రజనీకాంత్, ఏఐఎంఐఎం తరఫున సయ్యద్ ఫైజుల్లా, అబ్దుల్ సత్తార్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రెండో వార్షికోత్సవం

### చైర్మన్ చిరంజీవికి శాలువాతో సన్మానం

### ఆశయాల బుక్‌లెట్, జెండా, కండువా, లోగో ఆవిష్కరణ

**అక్షరశక్తి, హైద్రాబాద్:** బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ చైర్మన్ చిరంజీవిని హనుమకొండ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిరంజీవి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం భవిష్యత్ కార్యాచరణపై వివిధ జిల్లాల కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. బీసీల అభ్యున్నతి, సామాజిక సాధికారత కోసం చేపట్టబోయే కార్యక్రమాలు, ప్రజలకు అందించనున్న సేవలు, బీసీల హక్కులు మరియు ఔన్నత్యం కోసం చేపట్టాల్సిన పోరాటాలపై విస్తృతంగా వివరించారు. అనంతరం బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జెండా, కండువా, లోగోతో పాటు సంస్థ ఆశయాలు, సిద్ధాంతాలను వివరిస్తున్న బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ వీరస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్, వైస్ చైర్మన్ బెనర్జీ రాజగోవిందు, కొణతం కృష్ణతో పాటు వివిధ జిల్లాల కోఆర్డినేటర్లు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.






# అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో ప్రత్యేక ఉచిత యూరాలజీ క్యాంప్

### ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. జి మోహన్ చంద్ ఆధ్వర్యంలో అత్యాధునిక పరీక్షలు, నిపుణుల వైద్య సేవలు



**అక్షరశక్తి, వరంగల్:** మూత్రం సమయంలో మంట, తరచుగా మూత్రం రావటం, మూత్రంలో రక్తం కనిపించడం, కిడ్నీ/ వెన్ను నొప్పి, కిడ్నీలో రాళ్లు, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు, ప్రోస్టేట్ గ్రంధి పెరుగుదల సమస్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట, వరంగల్ ఆధ్వర్యంలో ఈ నెల 03, 04, 05 తేదీల్లో ప్రత్యేక యూరాలజీ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.
ఈ క్యాంప్‌లో ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. జి మోహన్ చంద్ రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి, వ్యాధి తీవ్రతను అంచనా వేసి అవసరమైన చికిత్సపై సమగ్ర సలహాలు అందించనున్నారు.
క్యాంప్ సందర్భంగా కంప్లీట్ బ్లడ్ కౌంట్, షుగర్ పరీక్ష, కంప్లీట్ మూత్ర పరీక్ష, క్రియాటినిన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ ( వైద్యుల సలహా మేరకు)అందించబడతాయి. అంతేకాకుండా ఇతర ఇన్వెస్టిగేషన్స్ పైన 50 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు కూడా అందుబాటులో ఉంటుందని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ క్యాంప్ ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుంది. ప్రజలు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకుని ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది. వివరాలకోసం అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట క్రాస్ రోడ్, 94598 75555 లో సంప్రదించాలి అని తెలిపారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణలో సూపర్వైజర్ల పాత్ర కీలకం: డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

**అక్షరశక్తి,హనుమకొండ:** జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య కార్యక్రమాల సమర్థ అమలులో హెల్త్ సూపర్వైజర్ల పాత్ర కీలకమని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. అప్పయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారులు, పబ్లిక్ హెల్త్ నర్సులు, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పనితీరును పర్యవేక్షించడంతో పాటు వారికి అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని సూచించారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ ఆరోగ్య స్క్రీనింగ్ పూర్తి చేయడంతో పాటు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించాలని తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్మోహన్ రావు మాట్లాడుతూ 2026లో ఇప్పటివరకు జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాలేదని, డెంగ్యూ కేసులు గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గాయని చెప్పారు. సమావేశంలో మాతా-శిశు సంక్షేమం, టీకాల కార్యక్రమం, టీబీ నిర్మూలన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.



# ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**అక్షరశక్తి, భూపాలపల్లి :** రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న అరైవ్ -- స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా పోలీసు శాఖ మరియు రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు,డ్రైవింగ్ లైసెన్స్,హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం,హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ఇతర ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై



మోటారు వాహనాల చట్టం ప్రకారం చలాన్లు విధించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన 50 వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ప్రయాణాన్ని సురక్షితంగా మార్చడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్ ధరించాలని, సీటుబెల్ట్ వినియోగించాలని, నిర్ణీత వేగ పరిమితులను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. రోడ్డు భద్రత అనేది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిటిఓ శ్రీనివాస్,భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు, భూపాలపల్లి సిఐ నరేష్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాలకు 19 నుంచి దరఖాస్తులు




**అక్షరశక్తి, హైదరాబాద్ :** తెలంగాణలో పోలీసు కొలువుల కోసం సిద్ధపడుతున్న నిరుద్యోగులు ఈనెల 19 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఎస్ఎల్‌పీఆర్బీ) చైర్మన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పోలీస్, ఎస్పీఎఫ్, ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు తేదీలను అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 19 ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు అధికారిక వెబ్ సైట్ www.tgprb.in ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నియామక ప్రక్రియ కోసం అభ్యర్థులు ప్రాసెస్ మొత్తానికి కలిపి ఒకేసారి వన్-టైమ్ ఫీజు చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పార్ట్-1 నింపే ముందే తమ మొబైల్‌లో ఆధార్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

### ఫీజుల వివరాలు ఇలా..

ఎస్సై స్థాయి పోస్టులైన.. ఎస్సై సివిల్, ఏఆర్, టీజీఎస్పీ, ఎస్ఏఆర్‌సీపీఎల్, ఎస్పీఎఫ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు రూ.750గా నిర్ణయించారు. రిజర్వేషన్ వర్తించని ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. ఫింగర్ ప్రింట్స్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు కూడా ఇదే ఫీజు వర్తిస్తుంది. కానిస్టేబుల్ స్థాయి పోస్టులు.. కానిస్టేబుల్ సివిల్, ఏఆర్, ఎస్ఏఆర్‌సీపీఎల్, ఎస్పీఎఫ్, ఫైర్ ఫైటర్, జైలు వార్డర్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీలకు రూ.600గా ఫీజు నిర్ణయించారు. రిజర్వేషన్ వర్తించని బీసీ, ఓసీ అభ్యర్థులకు రూ.1,200 ఫీజు నిర్ణయించారు. అభ్యర్థి ఒకటి కంటే ఎకువ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, దేహదారుఢ్య పరీక్షలు (పీఎంటీ/పీఈటీ) ఒకేసారి నిర్వహిస్తారని చెప్పారు. దీనికి సంబంధించిన వెసులుబాటుగా ఓసీ, బీసీ అభ్యర్థులకు ప్రతి అదనపు క్యాటగిరీ దరఖాస్తుపై రూ.100 ఫీజు తగ్గిస్తామని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50 తగ్గించనున్నట్టు బోర్డు తెలిపింది.



## వరంగల్‌లో పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి

**అక్షరశక్తి, వరంగల్ :** వరంగల్ లో రైతుల ప్రయోజనాల కోసం పండ్ల మార్కెట్ ను ఏర్పాటు చేయాలని వరంగల్ పండ్ల మార్కెట్ భూ సాధన కమిటీఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ రైతు సంఘాల నాయకులు ఈరోజు వరంగల్ అడిషనల్ కలెక్టర్ గణేష్ కి వినతిపత్రం ఇచ్చారు. గత ఐదు సంవత్సరాలుగా రైతులకు ఒక వేదికగా ఉండాల్సిన పండ్ల మార్కెట్ లేదని దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘాల నాయకులు తెలిపారు. వరంగల్ నగరానికి చుట్టూ ఉండే గ్రామీణ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో గాని లేదా ప్రైవేటు భూమి కొనుగోలు చేసి కానీ 30 ఎకరాలలో పండ్ల మార్కెట్ ను ఏర్పాటు చేయాలని వారు జిల్లా కలెక్టర్ ను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపల్లి బాబు అఖిల భారత రైతు సమాఖ్య ఏఐ కెఎఫ్ జిల్లా నాయకులు అయి ఐత నగేష్ అఖిలభారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు సుదమల్ల భాస్కర్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఓదెల రాజయ్య అఖిల భారత కిసాన్ సభ జిల్లా కన్వీనర్ వల్లందాస్ కుమార్ ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి నాయకులు బండి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# హనుమకొండలో దారుణం

**కాళ్లు, చేతులు కట్టి మెడ కోసి..**

**భార్యను హత్య చేసిన భర్త**

**అనాథలుగా ఇద్దరు చిన్నారులు**

**అక్షరశక్తి,హన్మకొండ క్రైం :** హనుమకొండ జిల్లాలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి గ్రేటర్ వరంగల్ 4వ డివిజన్ కృష్ణ కాలనీలో శనివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తన భార్యను అత్యంత క్రూరంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, నిందితుడు మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుమారు ఆరు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న ఈ దంపతులకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. అయితే కొంతకాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.



శనివారం రాత్రి భార్య కాళ్లు, చేతులు కట్టి, అనంతరం మెడ కోసి హత్య చేసినట్లు సమాచారం. ఘటన అనంతరం సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలు ఏమిటి? కుటుంబ కలహాలే ఈ దారుణానికి దారితీశాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుపై ఆందోళన ప్రేమతో ప్రారంభమైన వారి దాంపత్య జీవితం చివరకు విషాదాంతంగా ముగియడంతో ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోయి అనాథలయ్యారు. ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.